క్లుప్తంగా

రిమ్స్‌లో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఏటూరి లక్షుమమ్మ చారిటబుల్ ట్రస్టు సభ్యులు

కడప అర్బన్: ఏటూరి లక్షుమమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో శుక్రవారం 500 మంది పేదలకు అన్నదానం చేశారు. కడప లోని చెర్లోపల్లి గ్రామంలోని ఏటూరి లక్షుమ్మ వర్ధంతి సందర్భంగా ఏటూరి కుటుంబసభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏటూరి నరసింహారెడ్డి, ఏటూరి చంద్రారెడ్డి, ఏటూరి పెంచల్‌రెడ్డి, పాల్ రెడ్డి ఏటూరు వినయ్‌కుమార్ రెడ్డి, అల్లుడు మన్యం నాగేశ్వరరెడ్డి, కోడళ్లు, కుమార్తెలు, మనువళ్లు, మనువరాళ్లు, బంధువులు పాల్గొన్నారు.

రేపు ప్రైమ్ ఆసుపత్రిలో మెగా ఉచిత వైద్య శిబిరం

కడప రూరల్: ఈ నెల 31వ తేదీన కడపలోని ప్రైమ్ ఆసుపత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎముకలు, కీళ్లు, వెన్నెముక శస్త్ర వైద్య నిపుణులు మహేష్ తెలిపారు. డాక్టర్ మహేష్ బ్యంగి పర్యవేక్షణలో వైద్య శిబిరం జరుగుతోందన్నారు. ఈ శిబిరం ద్వారా ఎముకలు, వెన్నుముక, కీళ్లు తదితర వ్యాధులకు వైద్యం పొందవచ్చని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరం ఉంటుందని తెలిపారు. తమ పేరుతో పాటు పూర్తి వివరాలకు సెల్ నంబరు 9398008129 ను సంప్రదించాలని పేర్కొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కడప ఎడ్యుకేషన్: కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ 11వ పీఆర్‌సీ మేరకు నిర్ణయించబడిన కనిష్ట మూలవేతనాన్ని వర్తింప చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సివి.ప్రసాద్, చంగల్‌రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఈశ్వరచంద్ర, అలీఖాన్‌లు కోరారు. వారు మాట్లాడుతూ అవసరమైతే ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకోవాలని కోరారు. దీనిపై ఇప్పటికే హైకోర్టు సానుకూలంగా స్పందించిందని, సదరు ఆదేశాలను అమలు పరిచి న్యాయబద్ధమైన డిమాండ్‌ను నెరవేర్చాలని కోరారు. 2022 నుంచి వీరికి బకాయిలు కూడా చెల్లించాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

18 బీరు బాటిళ్లు స్వాధీనం

కడప అర్బన్: కడప నగరంలోని ఒన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత రాయల్ థియేటర్ సమీపంలో రవీంద్రనగర్‌కు చెందిన సయ్యద్ ఇర్ఫాన్ శనివారం 18 బీర్ బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తుండగా ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు.

టీడీపీ నేతలపై కేసు నమోదు

కడప అర్బన్: కడప ఎన్టీఆర్ సర్కిల్ వద్ద టీడీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించడంపై కేసు నమోదైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటించకుండా, అనుమతులు లేకుండా టీడీపీ నేతలు కేక్ కట్ చేశారని సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులుగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్. శ్రీనివాసులు రెడ్డి, కడప అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఆర్.మాధవరెడ్డి, ట హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డిలతోపాటు, పలువురు వున్నారు.

ఘనంగా మండల పూజ

వేముల : పెర్నపాడు గ్రామంలోని శ్రీ రామాలయంలో శుక్రవారం మండలపూజ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలో రూ.1.50 కోట్లతో నూతనంగా శ్రీ రామాలయం నిర్మించారు. ఈ ఆలయంలో ఫిబ్రవరి 20వ తేదీన సీతారామలక్ష్మణసమేత ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. విగ్రహాలను ప్రతిష్ఠించి 41 రోజులు కావడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, మండల కన్వీనర్ నాగెళ్ల సత్యప్రభావతమ్మ, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పూజ సందర్భంగా పురోహితులు హోమం నిర్వహించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేపటి నుంచి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

సింహాద్రిపురం : ఈనెల 31వ తేదీన ఆదివారం నుంచి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటలకు భానుకోట శైవక్షేత్రంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం అహోబిలాపురం, రావులకొలను గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల పరిశీలకులు వీరశివారెడ్డి పాల్గొంటారన్నారు. మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

త్యాగంతో రక్షకుడైన క్రీస్తు



నగరంలో శిలువయాగం దృశ్యం



శిలువయాగం ర్యాలీలో విశ్వాసులు




క్రైస్ట్ చర్చిలో ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు

- ఘనంగా గుడ్ ఫ్రైడే కార్యక్రమాలు
- ఆకట్టుకున్న శిలువయాగం దశ్యాలు

కడప కల్చరల్: ప్రభువైన ఏసుక్రీస్తు తన జీవితాన్ని త్యాగం చేసి మానవ లోకానికి రక్షకుడిగా మారాడని పలువురు క్రైస్తవ గురువులు పేర్కొన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం పలు చర్చిల సంఘాలు, క్రైస్తవ కమిటీ సభ్యులు, గురువుల ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో శిలువ యాగం నిర్వహించారు. మాసాపేటలోని సెయింట్ జాన్ చర్చి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ గుడిమె దేవ సహాయం, ఆరోగ్య మాత పుణ్య క్షేత్రం డైరెక్టర్ పాదర్ ఎండీ.ప్రసాద్‌రావు పాల్గొన్నారు. డాన్‌బాస్కో ఐటీఐ నుంచి ఆరోగ్య మాత చర్చి వరకు ఫాదర్లు, భక్తులు శిలువను మోస్తూ ర్యాలీ నిర్వహించారు. సాయంత్రం క్రీస్తు శ్రమలు, మరణ చరిత్ర, శిలువ ఆరాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. గురువులు మాట్లాడుతూ క్రీసు ప్రభువు తన ప్రాణాన్ని పాపుల రక్షణ కోసం బలిగా సమర్పించారని, ఈరోజు సకల ప్రజలకు శుభ శుక్రవారమని తెలిపారు. కార్యక్రమంలో సహాయ డైరెక్టర్ ఫాదర్ నాగిపోగు బాబు, ఫాదర్ సల్లా మనోహర్, జేఎంజే మదర్లు, చర్చి పెద్దలు, శాంతి సేవా సొసైటీల వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్, పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

శిలువయాగం

సీఎస్ఐ సెంట్రల్ చర్చి పాస్టర్ రెవరెండ్ ఫాదర్ ఐజాక్ వరప్రసాద్, పాస్టర్ మత్తయ్యాబాబులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఏసుక్రీస్తు శిలువపై పాపుల రక్షణ కోసం అనుభవించిన యాతనను వివరించారు. మానవతా వాదిగా ఆయన శిలువపై నుంచి చెప్పిన ఏడు మాటల అర్థాన్ని కూడా వివరించారు. భక్తులచే వాక్య పరిచర్య చేయించారు. మరియాపురం గ్రామంలోని పునీత జోజప్ప టవర్ వద్ద నుంచి మరియాపురం విచారణ గురువుల పర్యవేక్షణలో శిలువ యాగం ర్యాలీ నిర్వహించారు. భక్తులు పోటీపడి శిలువను మోస్తుండగా, 14 చోట్ల ఆగి క్రీస్తు చివరి ఏడు మాటలను గుర్తు చేసుకున్నారు. మద్రాసురోడ్డులోని పాస్టరల్ సెంటర్‌లో ఫాదర్ శిలువయాగం ర్యాలీ నిర్వహించారు. భక్తులు ర్యాలీగా వెంట రాగా, ఆయన స్వయంగా శిలువను మోస్తూ గుడ్‌ఫ్రైడే విశేషాలను వివరించారు. బిల్టప్ వద్దగల న్యూ కృపా నేటివ్ చర్చి ఆధ్వర్యంలో ఫాదర్ మహేష్, సిస్టర్ శాంతమ్మ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



క్రైస్ట్ చర్చిలో గుడ్ ఫ్రైడే సందేశాన్ని అందజేస్తున్న మత గురువు మత్తయ్యా బాబు

ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేయాలి



బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నందలూరు(రాజంపేట) : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించామని, ప్రజలందరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, రాజంపేట డీఎస్పీ చైతన్యల ఆదేశాల మేరకు ఎస్ఐ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బలగాలతో టంగుటూరు, పొత్తపి గ్రామాలలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయడానికి అందరూ పోలీసులకు సహకరించాలని తెలియజేశారు. మండలంలో ఎటువంటి ఘర్షణలు జరిగినా కేసు నమోదు చేయడంతోపాటు అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

గంగమ్మకు కుంకుమార్చన



గాజులతో అమ్మవారికి విశేషాలంకరణ



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

కడప అర్బన్: కడప నగరంలోని నబీకోటలో వెలసిన గంగమ్మతల్లి దేవస్థానంలో శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారిని అభిషేకించి, అనంతరం గాజులతో సుందరంగా అలంకరించారు. ఉదయం 6 గంటలకు నబీకోట శివాలయం నుంచి ముత్తైదువులతో గంగా జలాన్ని కలశాలతో తీసుకుని వచ్చి అమ్మవారికి పూజలు జరిపారు. సాయంత్రం 6 గంటల నుంచి ఉచితంగా సుమంగళి కుంకుమార్చన జరిపారు. చిన్నపిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అధ్యాపకుడికి డాక్టరేట్

చింతకొమ్మదిన్నె : అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా పనిచేస్తున్న సి.వెంకటసుబ్బయ్యకు వేలూరు లోని వీఐటీ విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. వేలూరు వీఐటీ విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ కె.గోవింద్ పర్యవేక్షణలో ఇన్హెన్సింగ్ ది నెట్ వర్క్ పర్ఫార్మెన్స్ బై ఏ వ్యాల్యువేటింగ్ మల్టీ కాన్స్టంట్ ఫర్ వీలైబుల్ క్వాలిటీ ఆఫ్ సర్వీసింగ్ రౌటేట్ ఇన్ మొబైల్ హార్ట్ హాక్ నెట్వర్క్ ఫర్ హెల్త్ కేర్ సిస్టం అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను గౌరవ డాక్టరేట్ లభించిందని ఆయన తెలిపారు.

ఘనంగా శ్రీరామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట

ఓబులవారిపల్లె: కొర్లకుంట గ్రామంలో శ్రీ సీతారామ, లక్ష్మణ, హనుమత్ సమేత శ్రీరామ చంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను శుక్రవారం వేద పండితులు నిర్వహించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం మూలమంత్ర, నవగ్రహ జపాలు, అభిషేకం, అర్చన, దీక్షాహోమం, పారాయణం, మహానైవేద్యం, మహా మంగళహారతి, అష్టోత్తర శత దీపాలంకరణ, వేదపారాయణం, నైవేద్యం, మంత్ర పుష్పం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి ధ్వజస్తంభానికి నమస్కరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం పూజారులు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సావిత్రమ్మ, ఎంపీటీసీ వత్తలూరు రోహిణీ కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ ముక్కా రూపేష్‌కుమార్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, గ్రామస్తులు అంకన్నగారి ఎల్లారెడ్డి, అంకన్నగారి వేణుగోపాల్‌రెడ్డి, అంకన్నగారి లక్ష్మీకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన కోసం జగనన్నకే ఓటేయండి



కమలాపురం 3వ వార్డులో ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి

కమలాపురం : దేశంలో ఎక్కడాలేని విధంగా అమలవుతున్న సంక్షేమ పాలన కోసం జగనన్న ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి ప్రజలను కోరారు. శుక్రవారం కమలాపురం పట్టణంలోని 3వ కౌన్సిల్ వార్డులో ఆమె ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఆమె రాకను పురస్కరించుకుని మహిళలు హారతులు పడుతూ స్వాగతం పలికారు. ఆమె ప్రతి ఇంటి వెళ్లి ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో జగనన్న, నియోజకవర్గంలో తన తండ్రి రవీంద్రనాథ్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిందన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే మరొక్కసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను సీఎంగా గెలుపించుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డి, పోచిమరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఇస్మాయిల్, ఖాద్రి, ఇర్ఫాన్, గంగాధర్‌రెడ్డి, సాదిక్, శ్రీనివాస రెడ్డి, వంశీధర్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి, మస్తానయ్య, దేవదానం, కొండారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, గఫార్, జావీద్, ఖాజా హుసేన్, గౌస్ మోదీన్, సతీష్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, గండి భాస్కర్, పుత్తా మధు, నాగేంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, సత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా



రంజాన్ తోఫాను అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్: పట్టణంలోని స్థానిక జెండామా నువీధిలోని జామియా మసీదులో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ముస్లింలకు శుక్రవారం రంజాన్ తోఫాను అందజేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని 70 పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం రంజాన్ తోఫాను పేద ముస్లింలకు అందజేశారు. జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లి కిశోర్, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఖాదర్‌వలి, షఫీ, నూరు, ఖలీల్, సలాం, డొనాల్డ్ సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతకు అండగా నిలుద్దాం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ నరేష్ రామాంజులురెడ్డి

చెన్నూరు : సంక్షేమ, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ పోచంరెడ్డి నరేష్ రామాంజులురెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని రామనపల్లెలో ఆయన నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్లి కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డిలను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కమలాపురం నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసి ప్రజలందరికి అందుబాటులో ఉంటూ వారికి ఏ సమస్య వచ్చినా తీరుస్తున్న వారిని ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో మూడవసారి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ మాసిమబాబు, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, సర్పంచ్ స్వప్న దీపిక, తొగట వీరక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, జేసీఎస్ టౌన్ కన్వీనర్ శ్రీనివాసరాజు, సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి సాయికుమార్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సాయుధ బలగాలతో పోలీసు కవాతు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

రామాపురం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని లక్కిరెడ్డిపల్లె సీఐ గంగనాధబాబు కోరారు. మండల కేంద్రంలోని వీధులు, కల్పనాయునిచెరువు, సుద్దమళ్ల పంచాయతీలోని యర్రంరెడ్డిగారిపల్లె, బయారెడ్డిగారిపల్లె, నల్లగుట్టపల్లె పంచాయతీలో కొత్తపల్లి, చిట్లూరు గ్రామంలో 60 మంది కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ సిబ్బంది శుక్రవారం కవాతు నిర్వహించారు.

ప్రజలకు శాంతి భద్రతలపై వివరించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధైర్యంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మండల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఎంతో ప్రయోజనం

పులివెందుల టౌన్ : పాలిసెట్, ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్షలకు ఉచిత విద్య ఉపాధ్యాయుల శిక్షణ ఎంతో తోడ్పాటును అందిస్తుందని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థాని క ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సహకారంతో స్నేహిత అమృతహస్తం సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 10వ తరగతి పరీక్షలు రాసి ఉన్నత చదువుల కొరకు ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కొరకు పాలిసెట్, ఏపీఆర్జేసీ ప్రవేశాలకు 14 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఉచిత శిక్షణను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నా రు. విద్యార్థులు పోటీతత్వం అలవరచుకుని మంచి ర్యాంకులు సాధించి పోటీ పరీక్షలలో రాణించాలన్నారు. ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వరరెడ్డి, సేవాసమితి అధ్యక్షుడు రాజు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జ్యోతి ఉత్సవాలు



చౌడేశ్వరిదేవి అమ్మవారి మూల విరాట్

వల్లూరు : మండలంలోని వెంకటాపురం వీవర్స్ కాలనీలో వెలసిన చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు శనివారం నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. తొగట వీరక్షత్రియుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జ్యోతి ఉత్సవాలలో గ్రామోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. శనివారం ఉదయం చౌడేశ్వరీదేవి అమ్మవారికి జలాభిషేకం నిర్వహిస్తారు. గ్రామ దేవత వద్ద చల్ల కార్యక్రమం జరుగుతుంది. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహిస్తారు. సాయంత్రం బిందె సేవ జరుగుతుంది. రాత్రి జ్యోతులతో జ్యోతి ఉత్సవం, అమ్మవారి గ్రామోత్సవాలను నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం జ్యోతులను ఆర్పుట, బలి దానాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

రేపు దుగ్గాయపల్లెలో..

ఆదివారం దుగ్గాయపల్లెలోని శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రాత్రికి జ్యోతి ఉత్సవాలు, అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. సోమవారం ఉదయం జ్యోతులను ఆర్పుట, బలి దానాలు జరుగుతాయి. మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం జాతర జరగనుంది. ఇందులో భాగంగా గ్రామ దేవతల ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు.

ప్రత్యేక బస్సు సర్వీసు..

జాతరను పురస్కరించుకుని ప్రజల కోరిక మేరకు ఆది, సోమ వారాలలో కడప నుంచి పెద్దపుత్త వరకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ బస్సు కడపలో ఉదయం 8:30 గంటలకు, మధ్యాహ్నం 11:30 గంటలకు, సాయంత్రం 5:30 గంటలకు బయలు దేరుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమం కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలి



వీఎన్‌పల్లె : మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలను ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఓటెయ్యాలని కమలాపురం ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గంగిరెడ్డిపల్లె, మిట్టపల్లె గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి గురించి వివరించడంతో పాటు రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో మీ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలన్న సంకల్పంతో అహర్నిశలు కృషి చేసే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే ఆయన ధ్యేయమని అందుకే ఏ పథకం చేపట్టినా మహిళల పేరుతో అందించడం జరుగుతోందన్నారు. అన్ని వర్గాల వారికి సమ న్యాయం చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్ సంకల్పమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ఘనత చంద్రబాబునాయుడుదేనన్నారు. ఇచ్చిన హామీని 100 శాతం అమలు చేయాలన్నదే జగన్ మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలోని చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ రవి, స్థానిక నాయకులు చైతన్యకుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రతాప్‌యాదవ్, శ్రీనివాసుల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తులసీశ్వర్‌రెడ్డి, దస్తగిరి, గంగిరెడ్డి, ఈశ్వరయ్య, నరేష్, గంగాధర, మోహన్ రెడ్డి, ఎరికలన్న తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమం కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని లావనూరు, చెన్నమనేనిపల్లె, దొంకుపల్లె గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే సీఎం వైఎస్ జగనన్న వృద్ధాప్య పింఛన్ రూ.3 వేలు ఇస్తున్నారని ఇతర రాష్ట్రాలలో ఎక్కడ ఇంత పింఛన్ ఇవ్వలేదన్నారు. టీడీపీ నాయకులు అవదులు లేని హామీలను మీ ముందుకు తీసుకుని వస్తున్నారని గతంలో మాదిరిగా ఎవరు మోసపోవద్దని ప్రజలకు ఆయన సూచించారు. మీ బిడ్డ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక టీడీపీ రెండు పార్టీలతో పొత్తు పెటుకుని మీ ముందుకు వస్తున్నారన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు, కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్‌రెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో జమ్మలమడుగు పరిశీలకుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతరాజారెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సలహా కమిటీ చైర్మన్ ఒంటెద్దు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్వర్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం

రామాపురం: ప్రస్తుత వేసవి సీజన్‌లో మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారిని ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు రంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి తోటలను పరిశీలించారు. కేవలం 10 శాతం కూడా కోతలు కనిపించడం లేదని, చెట్లకు మామిడి కాయలు కూడా కనిపించడం లేదన్నారు. 2021-22 సంవత్సరంలో తీవ్రమైన కరోనాతో దిగుబడి తీసుకెళ్లేందుకు వ్యాపారస్తులు రాకపోవడంతో చెట్ల మీదనే వదిలేయడం జరిగిందని తెలిపారు. 2023లో అరకొర పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలతో దిగుబడి కూడా నేలమట్టమైందన్నారు. ఈ ఏడాది ఏ తోటలో చూసినా కాపు కనిపించడం లేదన్నారు. ఉపాధి హామీ పనులను మామిడి రైతులకు ఉపయోగపడేలా అనుసంధానం చేయాలని కోరారు. మామిడి తోటలు ఎండిపోకుండా రైతులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పట్టాభిరెడ్డి, రామాంజల్‌రెడ్డి, వెంకటమల్లప్పనాయుడు, సుబ్బయ్య పలువురు రైతులు పాల్గొన్నారు.